ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

- 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పరీక్షలు
- 14న ప్రారంభించనున్న ఆరోగ్య శాఖ
- జిల్లా కేంద్రంలో ఆరోగ్య సిబ్బందికి శిక్షణ


పెదనింద్రకొలను పీహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది

నిడమర్రు: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై విజయం – స్క్రీనింగ్ సాధ్యం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈనెల 14వ తేదీ నుంచి ఇంటి వద్దే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ స్థానిక ఆరోగ్య సిబ్బంది ద్వారా ప్రాథమిక క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. దీని కోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహణపై వైద్య ఆరోగ్య సిబ్బందికి జిల్లా కేంద్రం ఏలూరులో ఈనెల 8వ తేదీ శుక్రవారం నుంచి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రోగ నిర్ధారణకు దోహదం

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 ప్రకారం క్యాన్సర్, దాని ప్రారంభం చాలా ఆలస్యంగా గుర్తిస్తున్నట్లు వెల్లడైంది. ఫలితంగా రోగ నిర్ధారణ ఆలస్యమవుతుంది. దీంతో సంబంధిత వ్యక్తుల మరణాలకు దారితీస్తుంది. క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కోవాలంటే ముందస్తుగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలి. ప్రాథమిక దశలోనే క్యాన్సర్ కణాలను గుర్తించడం ద్వారా క్యాన్సర్ బాధితుల మరణాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చు. ఒక వ్యక్తిలో ఏదైనా లక్షణం కనిపించక ముందే క్యాన్సర్ కణాల కోసం వెతకడాన్నే క్యాన్సర్ స్క్రీనింగ్ అని పిలుస్తారని పెదనింద్రకొలను పీహెచ్‌సీ డాక్టర్ పి.తేజశ్రీ తెలిపారు. క్యాన్సర్ నివారణ, ముందస్తు రోగ నిర్ధారణ, మెరుగైన ఫలితాల కోసం ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు దోహదపడతాయి.

ప్రత్యేక యాప్

క్యాన్సర్ లక్షణాలు ప్రాథమిక స్థాయిలో గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆయుష్మాన్ భారత్ సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. మహిళల్లో ఎక్కువగా గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ల బారినపడుతున్నారు. ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల కోసం 18 ఏళ్లు నిండిన మహిళల వద్దకు వెళ్లి ఆరోగ్య సమస్యల్లో నెలసరి వివరాలు ఆన్‌లైన్ చేయనున్నారు. వీటితోపాటు ప్రతి ఒక్కరి దంత క్షయాలు (నోటి కుహరం) వంటి సమస్యలు నమోదు చేయడం ద్వారా క్యాన్సర్ దశను ప్రాథమిక అంచనా వేస్తారు.

అవగాహన ర్యాలీలు

క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ స్క్రీనింగ్‌పై గురువారం మండలంలోని మేజర్ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈనెల 14 నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కొనసాగనుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో వైద్య సిబ్బంది అంచనా ప్రకారం రెండు లక్షల మందికి ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాథమిక లక్షణాలు గుర్తించిన వారిని స్థానిక వైద్యులు రిఫర్ చేస్తూ జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక క్యాన్సర్ వైద్య శిబిరాలకు పంపిచనున్నారు.

స్క్రీనింగ్ పరీక్షకు అర్హులు

మండలం	18 ఏళ్లు నిండినవారు
భీమడోలు	51,541
గణపవరం	50,353
నిడమర్రు	36,933
ఉంగుటూరు	62,746
మొత్తం	2,01,573

స్క్రీనింగ్ పరీక్షలతో మేలు



క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో ముందస్తుగా క్యాన్సర్ లక్షణాలను గుర్తించవచ్చు. కొల్లేరు గ్రామాల్లో ఎక్కువ మంది మహిళలు గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ లక్షణాలతో బాధపడుతున్నారు. వారికి ఈ పరీక్షలతో సత్ఫలితాలు పొందవచ్చు. ఈనెల 14వ తేదీ నుంచి ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటి వద్దే ఈ స్క్రీనింగ్ నిర్వహిస్తారు.

– కె.భాగ్యశ్రీ, మండల వైద్యాధికారి, నిడమర్రు

క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ బాషా

దెందులూరు: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాషా అన్నారు. బుధవారం దెందులూరు రైతు సేవా కార్యాలయంలో దెందులూరు మండలం అధికారులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తీ సమాచారం పొందటం భారత రాజ్యాంగం కల్పించిన హక్కన్నారు. అడిగిన సమాచారాన్ని నిర్ణీత గడువులో ఇవ్వకపోతే సమాచార హక్కు చట్టం ప్రకారం తీసుకునే చర్యలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ప్రతి కార్యాలయాలను సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, దెందులూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి డి.వెంకటేశ్వరరావు, అన్ని శాఖల అధికారులు ఉన్నారు.

హెచ్‌ఎం విష్ణు మృతి


ప్రధానోపాధ్యాయులు విష్ణు

దెందులూరు: మండలంలోని జోగన్నపాలెం శ్రీ విద్యాలయం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈడుపుగంటి విష్ణు బుధవారం ఏలూరు ఆయన నివాసంలో మృతి చెందారు. విష్ణు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య పిల్లలు ఉన్నారు.

ఎస్సీ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడిగా డేవిడ్ రాజు


ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న డేవిడ్ రాజు

దెందులూరు: ఎస్సీ ఫిషర్‌మెన్ దెందులూరు కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా తోట డేవిడ్ రాజు ఎన్నికయ్యారు. గురువారం సొసైటీ ఎన్నికల అధికారి స్పెషల్ మాస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ అధికారిక పత్రాన్ని డేవిడ్‌రాజుకు అందజేశారు. ఈ పత్రాన్ని డేవిడ్ రాజు, సొసైటీ డైరెక్టర్ ఎంత్రపాటి కానుక రాజు విలేకరులకు చూపించారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజోత్సవం


పడి పూజ చేస్తున్న అయ్యప్పలు

భీమడోలు: గుండుగొలనులోని భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి అయ్యప్ప పడి పూజోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్తీక మాసంలో తొలి బుధవారం కావడంతో ఆలయ అర్చకులు లంకా శివకుమార్ పర్యవేక్షణలో సుందరంగా తయారీ చేసిన అయ్యప్ప ఆలయం, పడి మెట్లు వద్ద వందలాది మాలధారులు అయ్యప్ప పడి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప పాటలు పాడి నృత్యాలు చేశారు. పేట తుల్లి ఆడారు.

సాఫ్ట్ టెన్నిస్‌లో గణపవరం జట్టుకు నాలుగో స్థానం


గణపవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు

గణపవరం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఎస్‌జీఎఫ్ సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు నాలుగో స్థానం సాధించింది. వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో ఈనెల 6, 7 తేదీల్లో రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తరపున ఆడిన గణపవరం బాలుర ఉన్నత పాఠశాల జట్టు నాలుగో స్థానంలో నిలిచిందని పీడీ పద్మావతి తెలిపారు. జట్టు సభ్యులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే

భీమడోలు: తాడేపల్లిగూడెం సమీపంలో కొండ్రుప్రోలు వద్ద గురువారం జరిగిన ఆటో ప్రమాదంలో గాయాలపాలైన భీమడోలు, వడ్లపట్ల గ్రామాలకు మహిళా కూలీలను ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు గురువారం పరామర్శించారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి వెళ్లి వారికి అందుతోన్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

అబ్బయ్య చౌదరిని కలిసిన నాయకులు


మాజీ ఎమ్మెల్యేను కలిసిన పార్టీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం ఆయన్ని తన కార్యాలయంలో పార్టీ దెందులూరు, పెదపాడు మండలాల నాయకులు కలిశారు. గ్రామాల్లో చోటుచేసుకుంటున్న పార్టీ పరమైన ఘటనలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులపై మాట్లాడారు. పార్టీ ఎస్సీ సెల్ మండల్ నాయకులు నిట్టా గంగరాజు, పెదపాడు మండల ఎస్సీ సెల్ నాయకులు బత్తుల ఏసురాజు, పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, దోసపాడు నాయకులు మహేంద్ర, గాలాయగూడెం పంచాయతీ వార్డు మెంబర్ శ్రీధర్ కార్యకర్తలు ఉన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షలకు 52 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ పరీక్షలకు గురువారం 52 మంది హాజరయ్యారు. రెండో సెమిస్టర్ పరీక్షకు 46 మందికి 46 మంది హాజరయ్యారు. దీంతో రెండో సెమిస్టర్ పరీక్షలు ముగిశాయి. ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షకు 11 మందికి ఐదుగురు హాజరయ్యారని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

పెరుగుతున్న క్యాన్సర్ బాధితుల సంఖ్య


గణపరం : క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న క్యాన్సర్ నిపుణుడు రేవంత్‌రెడ్డి


దెందులూరు : క్యాన్సర్‌పై విద్యార్థుల ప్రదర్శన

గణపవరం: ఆహార అలవాట్లు, జంక్ ఫుడ్స్, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్ల వల్ల క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోందని ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు రేవంత్‌రెడ్డి అన్నారు. గురువారం గణపవరం మండలం పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గణపవరం లయన్స్‌క్లబ్ భవనంలో క్యాన్సర్ అవగాహన సదస్సు పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎం సత్యనారాయణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. అఖిల భారత పీఎంపీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పీఎంపీ అసోసియేషన్ శాఖల ద్వారా నిత్యం పేదలకు ఉచిత వైద్యసేవలు, ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అసోసియేషన్ గౌరవ సలహాదారు నిడమర్తి జయసూర్య, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సుభాన్, గణపవరం మండల సభ్యులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

పెదపాడు : క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెదపాడు పీహెచ్‌సీ వైద్యుడు అనంతపాల్ అన్నారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బళ్ల రేవుతూము సెంటర్ వరకు వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

దెందులూరు: జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని స్థానిక బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో గురువారం నిర్వహించారు. విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు మాట్లాడుతూ 2014లో క్యాన్సర్‌పై అవగాహన దినోత్సవం ప్రారంభించారని, యూఎంహెచ్‌ఏ ఫెడబ్ల్యూ మొదటగా నిర్వహించిందని తెలిపారు. నీలిమ, శైలిజ క్యాన్సర్, దీనికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. క్యాన్సర్ శరీరంలో ఏ అవయవానికైనా వ్యాప్తి చెందుతుందని, ఏడు రకాల క్యాన్సర్ సోకుతుందని అన్నారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా క్యాన్సర్లను నివారించవచ్చన్నారు. వివిధ రకాల క్యాన్సర్లకు కలర్స్‌తో సూచించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. బ్లూ కలర్ బోన్ క్యాన్సర్, గ్రీన్ కలర్ లివర్ క్యాన్సర్, స్కై బ్లూ కలర్ ప్రోస్టేట్ క్యాన్సర్, వైట్ కలర్ లంగ్ క్యాన్సర్, పింక్ కలర్ బ్రెస్ట్ క్యాన్సర్, బ్లాక్ కలర్ స్కిన్ క్యాన్సర్, సిమెంట్ కలర్ బ్రెయిన్ క్యాన్సర్‌ని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా, సైకాలజీ కీలక అంశాలు


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, ప్రముఖులు

దెందులూరు: సోషల్ మీడియా, సైకాలజీ ప్రతి వ్యక్తికీ కీలకమని సైకాలజిస్ట్ విప్రో థెరపిస్ట్ అక్కింశెట్టి రాంబాబు అన్నారు. గురువారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన బీపీడీ వ్యాయామ విద్యార్థులకు సైకాలజీ, సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఆలోచించే విధానాలు పట్ల థింక్ డిఫరెంట్ అనే అంశంపై అవగాహన కల్పించారు. గన్నవరం వెటర్నరీ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ యువతతో పాటు ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సోషల్ మీడియా దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ దాసరి గణేష్, ప్రెసిడెంట్ ఎస్‌వీ ప్రసాద్, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భీమడోలు: బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. గుండుగొలను శాఖా గ్రంథాలయం ఆవరణలో గురువారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సహకారంతో బాల్య వివాహాలను అరికట్టడంపై తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్రాఫ్ట్ జిల్లా సమన్వయకర్త ఆర్ వినోద్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలకు 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేయరాదన్నారు. గ్రామాన్ని వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో బాల్య వివాహక నిరోధక బృందాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూర్జహాన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో బాల్య వివాహలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. డీసీపీయూ కౌన్సలర్ బాలస్వామి మాట్లాడుతూ బ్యాల వివాహన నిరోధక చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు వారికి వివాహం చేస్తే ఇరు వర్గాలకూ శిక్ష పడే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి జి.నాగమణి, సెక్టార్ సూపర్‌వైజర్ ఎం కవిత, హెచ్‌ఎస్ డి.రామకృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలి


తహసీల్దార్ సుమతికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దెందులూరు: అసైన్డ్, సీలింగ్ భూములను పేదలకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం దెందులూరు మండలం రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ బి.సుమతికి వినతి పత్రం అందజేశారు. అసైన్డ్, సీలింగ్ భూములను పంచి దోసపాడు పేదలు, దళితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ భూములను అర్హులకు కాకుండా భూస్వాములకు కట్టబెట్టేలా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వేసవికాలంలో ఎండబెట్టిన చెరువులను సర్వే చేయకుండా తాత్సారం చేసి, ఇప్పుడు నీరుంది సర్వే చేయడం సాధ్యం కాదని చెప్పడం సిగ్గుచేటని వివరించారు. జాయింట్ కలెక్టర్ కోర్టు ఆదేశాలను కూడా పక్కన పెట్టి మండలంలో వీఆర్‌ఓ, మండల రెవెన్యూ శాఖ అధికారులు సోద్యం చూస్తున్నారని తెలిపారు. భూస్వాములు రొయ్యలు, చేపల పంట వేసేప్రయత్నం చేస్తుంటే ప్రభుత్వం కాపాడడం లేదని పేర్కొన్నారు. దోసపాడు గ్రామంలో అర్హుల జాబితాను గ్రామ సచివాలయం వద్ద వెల్లడించాలని కోరారు. పోతునూరు గ్రామంలో 115 ఎకరాల అసైన్డ్, సీలింగ్ భూములను పప్పు సింగ్, ఆయన బినామీలు దౌర్జన్యం చేసే పేదల నుంచి బలవంతంగా లాగేసుకుంటే అధికారులు ఏం చేస్తున్నానని ప్రశ్నించారు. ఆ భూములను వెంటనే సర్వేలు చేసి పేదలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సీనియర్ నాయకులు బలగం అప్పారావు, మండల నాయకులు పంతగాని ఆనందరావు, దోసపాడు భూ పోరాట నాయకులు జాన్ రాజు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు


ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న జేసీ ప్రవీణ్‌కుమార్

గణపవరం: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకూ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టరు కె.ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం గణపవరం మండలం చిలకంపాడు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కామన్ రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,300, ఏగ్రేడు రకం క్వింటాల్‌కు రూ.2,320గా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. మద్దతు ధరకు తక్కువగా రైతులు ధాన్యం అమ్మవద్దని సూచించారు. సిబ్బంది రైతులను నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టవద్దన్నారు. రైతులకు అవసరమైన సంచులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై.అప్పారావు, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్, కాశిపాడు సొసైటీ కార్యదర్శి ఇందుకూరి రామకృష్ణంరాజు, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు ఉపాధి దొరకకుండా కుట్ర

దెందులూరు: మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పెంచి కార్మికులకు పని దొరకకుండా చేసే విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిల్లో మెటీరియల్ కాంపోనెంట్ నిధులు 40 శాతం ఉండాలని, కార్మికులకు 60 శాతం ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. దెందులూరు మండలం దోసపాడు గ్రామ సభలో ఆయన మాట్లాడారు. వామపక్ష పార్టీల పోరాటం ఫలితంగా 2004లో ఉపాధి హామీ చట్టం వచ్చిందని, దీనిద్వారా పనులు కల్పించి పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్యానికి భిన్నంగా మెటీరియల్ కాంపోనెంట్ నిధులు పెంచే పద్ధతిని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మంచినీటి చెరువులు, పంట కాలువలు, మురుగు డ్రెయిన్ల ఆధునికీకరణ పనులను ఉపాధి కార్మికులతో చేయించాలన్నారు. మట్టి పని, చెరువు పూడికలు, గ్రామం వ్యవసాయానికి అనుబంధ పనులు రద్దు చేయాలని కోరారు. అర్బీకల్చర్, పశువులు షెడ్లు వంటి వాటిని ఉపాధి పనుల్లో పెట్టడం సరికాదని తెలిపారు. జంగిల్ క్లిరెన్స్, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను ఉపాధి హామీ చట్టంలో చేర్చాలన్నారు. ఉపాధి కూలీలకు 15 రోజులకు ఒకసారి పే స్లిప్, వేతనం ఇవ్వాలని, కూలి రూ.600 చేయాలని, 200 రోజులు పని కల్పించాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ లింగారావుగూడెంలో పేకాట శిబిరంపై ఏలూరు రూరల్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. ఐదుగుర్ని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,300 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

'కొఠారు'ను పరామర్శించిన కోటగిరి


కొఠారును పరామర్శిస్తున్న మాజీ ఎంపీ శ్రీధర్

పెదవేగి : గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావును మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ పరామర్శించారు. గురువారం పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని కొఠారు నివాసంలో కోటగిరి శ్రీధర్ రామచంద్రరావును కలిశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శ్రీధర్‌తో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఉన్నారు.

అభయ యాప్‌తో మహిళలకు భరోసా


యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై

ఏలూరు టౌన్: మహిళలు, విద్యార్థినులు ఆపద సమయంలో భద్రతకు అభయ యాప్‌ను వినియోగించుకోవాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై క్రాంతిప్రియ అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో నగరంలో ఆయా ప్రాంతాల్లో మహిళల భద్రత, విద్యార్థినుల ఈవ్‌టీజింగ్‌పై కౌన్సిలింగ్ ఇచ్చారు. పాతబస్టాండ్, కొత్తబస్టాండ్ ప్రాంతాలతో పాటు బస్సుల్లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నగరంలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు బస్సుల్లో ప్రయాణించే సమయంలో ఫుట్‌పాత్ ప్రయాణాలు ప్రమాదకరమని సూచించారు. దీనిపై బస్సు డ్రైవర్లు, కండక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళలకు ఆపద వస్తే అభయ యాప్‌ను, డయల్ 112కు ఫోన్ చేయాలని క్రాంతిప్రియ సూచించారు. మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు.

15న ఏలూరులో కొల్లేరు సదస్సు

ఏలూరు (టూటౌన్): కొల్లేరు పరిరక్షణకు ఈనెల 15న ఏలూరులో సీపీఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. బుధవారం ఏలూరులో నిర్వహించిన సీపీఐ జిల్లా సమితి సమావేశం నిర్ణయాలను గురువారం ఆయన సీపీఐ కార్యాలయంలో వెల్లడించారు. సదస్సుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు హాజరవుతున్నట్టు చెప్పారు. ఎన్నికల హామీ మేరకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు నివాసయోగ్యమైన ప్రాంతాల్లో కేటాయించాలని కోరుతూ సీపీఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఈ నెల 18న గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేస్తామని తెలిపారు. ఏలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లోని పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు, గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని ఈ నెల 11న బుట్టాయిగూడెం ఐటీడీఏ కార్యాలయం వద్ద చేపట్టే ఆందోళన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్టు చెప్పారు. డిసెంబర్ 26న సీపీఐ 100వ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించనున్నట్టు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈనెల 26న నిర్వహించే దేశవ్యాప్త నిరసనను సీపీఐ బలపరుస్తున్నట్టు తెలిపారు.